## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**90324 97123**

నంబర్‌ను సంప్రదించండి

## క్లుప్తంగా

### అలరించిన కూచిపూడి నృత్యం



చిన్నారుల నృత్య ప్రదర్శన

**దాబాగార్డెన్స్ :** ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కూచిపూడి నృత్యాలు నిర్వహించారు. గాజువాకకు చెందిన శ్రీవేద గాయత్రి నృత్య శిక్షణ సంస్థ శిక్షకురాలు ధరణి, హిమబిందు నేతృత్వంలో 30 మంది చిన్నారులు నృత్య ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బుద్ధ మహలక్ష్మీ నగేష్, ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా రాట మహోత్సవం



రాట మహోత్సవంలో పాల్గొన్న కోలా గురువులు, బాబీరెడ్డి తదితరులు

**అల్లిపురం :** గౌరీవీధిలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారి రాట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, తూర్పు నియోజకవర్గం పార్టీ పరిశీలకులు బాబీ రెడ్డి, పార్టీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి నీలాపు రమణారెడ్డి, నీలమ్మ వేపచెట్టు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సూర్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ

**దాబాగార్డెన్స్ :** నియోజకవర్గ పరిధి పలు యూపీహెచ్‌సీల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బురుజుపేట సచివాలయం పరిధి రంగిరీజువీధి యూపీహెచ్‌సీ, డిబ్బలపాలెం/చందకవీధి సచివాలయాల పరిధి చెంగల్రావుపేట (జబ్బరతోట) యూపీహెచ్‌సీ, కుమ్మరవీధి సచివాలయం పరిధి కొబ్బరితోట యూపీహెచ్‌సీ, సుబ్బలక్ష్మీనగర్ సచివాలయం పరిధి రైల్వే న్యూకాలనీ యూపీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

### భారతీ స్కూల్‌కు అపుస్మా అవార్డు

**ఆరిలోవ:** ఆరిలోవలో భారతీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్–అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్) స్కూల్ జ్యూరీ చాంపియన్‌షిప్ అవార్డు లభించింది. ఈ నెల 14న న్యూఢిల్లీలో నేషనల్ ఎడ్యుకేషన్ వరల్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ జ్యూరీ అవార్డుల ప్రదానోత్సవంలో నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్స్ అసోసియేషన్(నిసా) అధ్యక్షుడు కుల భూషణ్‌శర్మ, రాష్ట్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి ఈ అవార్డును తనకు అందించినట్లు భారతీ స్కూల్ కరెస్పాండెంట్ ఎం.వి.రావు ఆదివారం తెలిపారు.

### నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

**దాబాగార్డెన్స్:** జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నారు. పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ తెలిపారు.



# వెల్లివిరిసిన.. నవరాత్రి శోభ

దసరా ఉత్సవాల శోభ మిన్నంటింది. ఆలయాలు చక్కగా ముస్తాబయ్యాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయాలకు పెద్ద ఎత్తున చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. విద్యుద్దీప కాంతులతో దుర్గాదేవి ఆలయాలు ప్రకాశవంతంగా దర్శనమిచ్చాయి.



బాలాత్రిపురసుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి

- ఘనంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణలో ఆలయాలు



ఎర్నిమాంబ ఆలయంలో జరిగిన దుర్గా పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా వెలంపేట దుర్గాలమ్మ



వెలంపేట దుర్గాలమ్మకు పూజలు చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు



మెయిన్‌రోడ్డులో గల దుర్గమ్మవారిని తిరువీధి ద్వారా తోడ్కొని వస్తున్న శ్రీ ధనశక్తి పీఠం ప్రతినిధులు



బంగారుమెట్టలో వెలసిన దుర్గమ్మ



బాలదుర్గాదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ

**దాబాగార్డెన్స్/అల్లిపురం/జగదాంబ/కంచరపాలెం :** దేవీ శరన్నవరాత్రులు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ నెల 23 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సాయంత్రం వేళల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరపనున్నారు.

**స్వర్ణకవచాలంకృత కనకదుర్గాదేవిగా దుర్గాలమ్మ..**
పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ ఆలయంలో ఆదివారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు స్వర్ణకవచాలంకృత కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జాము నుంచి భక్తులతో పాటు మాలలు ధరించిన భవానీమాతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**బాలా త్రిపుర సుందరీదేవిగా కన్యకాపరమేశ్వరి..**
కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవ రాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా అమ్మవారి ఉత్సవ విగ్రహానికి కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు 102 మంది మహిళలు ఒకే రకమైన వస్త్రధారణతో శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వేకువ జామున మూలవిరాట్‌కు పాలు, పెరుగు, గంధం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవికి గ్రంధి రాజేష్, కంకటాల నవీన్‌కుమార్ దంపతులు కంకణధారణ గావించి తొలి పూజ చేసి దసరా ఉత్సవాలు ప్రారంభించారు. దేవాలయ సంఘ మహిళా సభ్యులచే చండీ పారాయణం, దేవీ భాగవతం, బాలత్రిపురసుందరి జపం నిర్వహించగా, ఆలయ ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్‌శర్మ సామూహికంగా పూజలు నిర్వహించారు.

**వివిధ చోట్ల పూజలు..**
జీవీఎంసీ 29వ వార్డు శ్రీకృష్ణ చైతన్య మఠం జిల్లా పరిషత్ ఆటో స్టాండ్, కలెక్టర్ కార్యాలయం జంక్షన్‌లోని రావి దుర్గా గణపతి ప్రసన్న ఆంజనేయ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవీ మండపాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**జీవీఎంసీలో..**
జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో చైర్మన్ రొంగలి జగన్నాథం, అధ్యక్షుడు గొంప చంద్రమౌళి కార్యవర్గ సభ్యులు పాల్గొని దుర్గాదేవికి పూజలు నిర్వహించారు. కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఏ రాజు, బి. రామానాయుడు, ఎం. సంజీవరెడ్డి, జి. దేముడు, అల్లు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

**ఎర్నిమాంబ ఆలయంలో..**
జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 41వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, జేఏసీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంతశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, సాయంత్రం నవ చండీయాగం నిర్వహించారు, దుర్గాదేవిని ప్రత్యేక పూలతో అలంకరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీష, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**32, 33, 34 వార్డుల పరిధిలో..**
జీవీఎంసీ 32, 33, 34 వార్డుల పరిధిలో గల బంగారుమెట్ట, అల్లిపురం మెయిన్‌రోడ్డులోని శ్రీ ధనశక్తి పీఠం, గోకుల్ థియేటర్ దరి శ్రీ రాచపోలమాంబ అమ్మవారి ఆలయం, అచ్చియ్యమ్మపేట శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరం, రైల్వే స్టేషన్ దరి కనకదుర్గ ఆలయాల్లో ఆదివారం ఉదయం నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు.

**శ్రీ ధనశక్తి అమ్మవారి పీఠంలో..**
మెయిన్‌రోడ్డులో గల ధనశక్తి అమ్మవారి పీఠం ఆధ్వర్యంలో విజయవాడ తరహాలో అమ్మవారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు రవి భవానీ తెలిపారు. ఈ సందర్భంగా గోకుల్ థియేటర్ దరి రాచపోలమాంబ అమ్మవారి ఆలయం నుంచి అమ్మవారి ప్రతిమలను తిరువీధి ఉత్సవం ద్వారా ధనశక్తి పీఠం వద్దకు తీసుకు వచ్చి ప్రతిష్టించారు.

**రాచపోలమాంబ ఆలయంలో..**
గోకుల్ థియేటర్ దరి రాచపోలమాంబ ఆలయంలో వైభవంగా అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు, కార్యవర్గం పాల్గొన్నారు.

**షిర్డీ సాయి ధ్యానమందిరంలో..**
అచ్చియ్యమ్మపేట షిర్డీ సాయి ధ్యాన మందిరంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ షిర్డీ సాయిబాబా 105వ మహా సమాధి (పుణ్యతిథి) మహోత్సవాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక అభిషేకాలు, హారతులు నిర్వహించారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఉమ్మిడి నాగరాజుబాబా ప్రత్యేక పూజలు చేశారు.

**బాలదుర్గాదేవిగా సాగరగిరి కనకదుర్గమ్మ..**
యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం అమ్మవారిని బాలదుర్గాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

**రామకృష్ణా జంక్షన్‌లో..**
జీవీఎంసీ 35వ వార్డు పరిధి రామకృష్ణా బజారు జంక్షన్‌లో చెల్లా రామిరెడ్డి ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, దేవస్థానం చైర్మన్ మల్లిబాబు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జీవీఎంసీలో దుర్గమ్మవారిని పూజిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు



అచ్చియ్యమ్మపేట షిర్డీసాయి మందిరంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గోకుల్ థియేటర్ దరి శ్రీ రాచపోలమాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



షిర్డీసాయి మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి



దుర్గాదేవికి పూజలు చేస్తున్న మన్యాల శ్రీనివాస్

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి పూజలు

**కంచరపాలెం :** కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

## చురుగ్గా జగనన్న ఆరోగ్య సర్వే



రామ్మూర్తిపంతులపేటలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

**కంచరపాలెం :** జ్ఞానాపురం డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) పరిధిలో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి పక్కాగా సర్వే నిర్వహిస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ వినీలా తెలిపారు. ఈ నెల 30న జోన్–5 కార్యాలయం వద్ద, 31న కంచరపాలెం పరిధిలో గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, దయానందనగర్, పైడిమాంబ కాలనీ, చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీ ప్రజలకు వైద్య శిబిరాలు నిర్వహించేందుకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. మరో వారంలో సర్వే పూర్తి చేసి టోకెన్లు జారీ చేస్తామన్నారు.

## యుద్ధాన్ని అంతా వ్యతిరేకించాలి

**సీతమ్మధార :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ వల్ల 724 మంది చిన్నారులు, 458 మహిళలు మరణించారని అన్నారు. ఇజ్రాయిల్ చర్యలకు వ్యతిరేకంగా ప్రజలందరూ నిరసన తెలపాలన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథ్, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.లలిత, జానకి, సతీష్, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

### చదువుతోపాటు క్రీడలూ ముఖ్యమే

**సీతమ్మధార:** అఖిల భారతీయ విద్యా భారతి శిక్షా సంస్థాన్ ఆధ్వర్యంలో బీవీకే విద్యా సంస్థలు ఆతిథ్యమిస్తున్న 34వ జాతీయ బాస్కెట్ బాల్ చాంపియన్‌షిప్ ముగింపు పోటీలు ఆదివారం సీతమ్మధారలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహించారు. వీటిని మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

### గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

**దాబాగార్డెన్స్ :** కాన్వెంట్ జంక్షన్ ఫ్లైఓవర్ కింద ఆర్‌సీఎల్ కంపెనీ రోడ్డులో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. హార్బర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆమెకు 60 ఏళ్లు ఉంటాయి. గుర్తు తెలియని వాహనం వృద్ధురాలి ఎడమ కాలి మీదుగా వెళ్లడం వల్ల కాలు నుజ్జయ్యిందని పోలీసులు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 8331041665, 9908743614 నంబర్లలో సంప్రదించవచ్చు.

### 31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

**అల్లిపురం :** ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు తెలిపారు. ఈ మేరకు అల్లిపురం, సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ జిల్లా వ్యాప్తంగా జరిగే వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మికులంతా ఏఐటీయూసీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అదే రోజు పౌరగ్రంథాలయంలో వ్యవస్థాపక దినోత్సవం సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్.కె.రెహమాన్, బి.వెంకట్రావు, కె. సత్యాంజనేయ, జె. రామకృష్ణ, ఎస్ఎం మౌలాలీ, యు. పోతన్న తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



ఇంగ్లీష్ పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు

**అల్లిపురం :** విద్యార్థులకు దసరా సెలవుల నేపథ్యంలో అల్లిపురం శాఖ గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ప్రారంభించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని రిసోర్స్‌పర్సన్ డి.శ్రీను చెప్పిన పాఠాలను శ్రద్ధగా విన్నారు. ఇంగ్లీషు భాష గురించి విద్యార్థులకు ఆయన ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు, పాఠకులు పాల్గొన్నారు.

### నీలమ్మ వేపచెట్టు అమ్మవారి సన్నిధిలో టిడ్కో చైర్మన్



నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్న ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తదితరులు

**అల్లిపురం :** టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ ఆదివారం నీలమ్మ వేపచెట్టు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, ట్రస్ట్ బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు జోగారావుశర్మ ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### ఫైన్లు వేయటం సరికాదు



సూచనలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్

**సీతమ్మధార :** బీజేపీ ప్రభుత్వం ప్రమాదాల నివారణ పేరుతో 21, 31 జీవోలు తీసుకొచ్చి మోటార్ వాహనాలపై ఫైన్లు వేయడం సరికాదని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్ అన్నారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన రాఘవేంద్ర ఆటో స్టాండ్ డ్రైవర్ల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్ రంగ కార్మికులకు భద్రతతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ ఆటో, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ పిలుపులో భాగంగా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో వెంకట్, రమణ, గోపి, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకార కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి

**అల్లిపురం :** కొబ్బరితోటలో మత్స్యకార కమ్యూనిటీ హాలుకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నెల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మత్స్యకారులు కమ్యూనిటీ హాల్ కావాలని కోరినట్లు తెలిపారు. జీవీఎంసీ అధికారులతో మాట్లాడిన అనంతరం రూ.16 లక్షల నిధులు మంజూరు కావడంతో పనులు మొదలుపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం కులపెద్దలు ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్ తోట పద్మావతిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, దూడ అప్పారావు, సూరిబాబు, దేవి, గద్దిపల్లి అప్పన్న, అప్పలరాజు, ధనలక్ష్మి, కొండమ్మ, మత్స్యకార నాయకులు సూరాడ ఎల్లాజీ, కొండబాబు, దానయ్యమ్మ, శ్రీను, వెంకటేష్, వాడబలిజ సేవా సంఘం అధ్యక్షుడు దాసరి ఎల్లయ్య, సెక్రటరీ ఎల్లారావు, దానయ్య, వైట్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాంకు నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రంధి గోపి తదితరులు



కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు

**అల్లిపురం :** భారత అణుపితామహుడు, మానవతావాది, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్లో జరిగిన కార్యక్రమంలో 33వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ, పార్టీ నాయకులు పాల శ్రీహరిరెడ్డి, భీశెట్టి రాజు, ఆడారి వెంకట మహేష్, బూర్లి చిన్న తదితరులు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన దేశానికి చేసిన సేవను గుర్తు చేసుకున్నారు.

**ప్రకృతి చికిత్సాలయంలో..**
**మహారాణిపేట :** భారత మాజీ రాష్ట్రపతి, స్వర్గీయ ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి ఆదివారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో జరిగింది. శ్రీగాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శిష్టా లక్ష్మీనారాయణ ముందుగా కలాం చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం దేశ ప్రజలకు విలువలతో కూడిన సేవలందించారన్నారు. ఈ సందర్భంగా పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, డాక్టర్ వై.లక్ష్మణరావు, క్షీరాబ్ది దుతి, గేదెల శ్రీహరి, గౌరీ శంకర్, సుశీల, నరసయ్య, మరియమ్మ, హరి, మంగ, రమణ, గేదెల రాము, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.